ప్రజాశక్తి
ఆదివారం 24 ఆగస్టు 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

యూరియా.. ఏదయా ?

◆ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో అరకొరగానే సరఫరా ◆ ప్రైవేటులో భారీగా ధర పెంచి అమ్ముతున్న వ్యాపారులు
◆ ఖరీఫ్‌పై కొరవడిన ప్రభుత్వ సన్నద్ధత ◆ నష్టపోతామంటున్న రైతులు

ప్రజాశక్తి - అనకాపల్లి రూరల్, పద్మనాభం విలేకరులు

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో చాలా చోట్ల రైతులు ఎరువుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా సరిపడా దొరకడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి అన్నదాతలు నష్టపోతున్నారు. వారిపై ధరాభారం పడుతోంది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇటీవల వర్షాలు కురవడంతో రైతన్నలు పంట పనుల్లో నిమగ్నమయ్యారు. అనకాపల్లి జిల్లాలో ఈ సీజన్‌లో 2.10 లక్షల ఎకరాల్లో వరి, మరో 1.50 లక్షల ఎకరాల్లో ఇతర పంటలు సాగు సహజం. కొందరు రైతులు వర్షాలపై ఆధారపడి విత్తనాలు జల్లారు. దమ్ము పెట్టారు. మరికొందరు బోరు బావుల సాయంతో నెల రోజుల ముందే పంటలు వేసుకున్నారు. ఇప్పుడు పంటలు పెరుగుదల దశలో ఉన్నాయి. యూరియా తప్పనిసరి. సకాలంలో అది దొరక్కపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రైతులకు చేదోడుగా నిలిచే సొసైటీలలో కూడా ఎరువులు సరిపడా కానరావడం లేదు. ఎక్కడైనా కొద్దిగా వచ్చినా బ్లాక్ మార్కెట్‌లోకి వెళ్లిపోతున్నట్లు విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. మునగపాక మండల కేంద్రంలో రైతులకు 100 టన్నుల ఎరువులు అవసరముండగా కొరత నెలకొంది. అరకొరగా యూరియాను ప్రభుత్వం పంపిణీ చేసి చేతులు దులుపుకోవడంపై రైతన్నలు ఆగ్రహించి శనివారం పిఎసిఎస్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. కూటమి సర్కారు ఖరీఫ్‌కు సరిగా మిగతా 2లో..



మునగపాక పిఎసిఎస్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

29న సిఎం చంద్రబాబు రాక

డబుల్ డెక్కర్ బస్సుల ప్రారంభం సహా పలు కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 29న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విశాఖపట్నం రానున్నారు. ఆ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు విశాఖ నగరంలో పలు కార్యక్రమాలలో ఆయన పాల్గొంటారు. ఇప్పటివరకు అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం ఉదయం 11 గంటలకు ఎయిర్ పోర్టుకు చేరుకొని, అక్కడ నుంచి నోవాటెల్‌కు వెళ్తారు. అక్కడ జరిగే కార్యక్రమాలలో పాల్గొంటారు. అనంతరం పర్యాటక శాఖకు సంబంధించిన డబుల్ డెక్కర్ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమం, విఎంఆర్‌డిఎ ప్రారంభోత్సవ కార్యక్రమాలలో పాల్గొంటారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శాప్ నిర్వహించిన అమరావతి ఛాంపియన్ షిప్ కప్ ఫైనల్ పోటీలలో విజేతలకు ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తారు. అనంతరం ప్రో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తారు. గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే తెలుగు అధికార భాషా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ నుండి బయలుదేరి ఉండవల్లిలోని నివాసానికి చేరుకుంటారు. అయితే ముఖ్యమంత్రి పర్యటన అధికారికంగా ఖరారు కావాల్సి ఉంది. ఈ మేరకు కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ముఖ్యమంత్రి పర్యటించే ప్రదేశాలను శనివారం పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై విఎంఆర్‌డిఎ కమిషనర్ విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, టూరిజం, ఆంధ్రా యూనివర్సిటీ అధికారులతో తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు.

5 నుంచి వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్

▶ వార్త 2లో..

డిఎస్‌సి ఫలితాల్లో సత్తా

▶ వార్త 5లో..

25న వికలాంగుల ధర్నాను జయప్రదం చేయండి

▶ వార్త 6లో..



పరుగు తీస్తున్న విభిన్న ప్రతిభావంతులు

ఘనంగా స్పెషల్ ఒలింపిక్స్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జెసిఐ) వైజాగ్ ఆధ్వర్యంలో శనివారం పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్స్‌లో విభిన్న ప్రతిభావంతుల స్పెషల్ ఒలింపిక్స్ - 2025 ఘనంగా ప్రారంభమయ్యాయి. విభిన్న ప్రతిభావంతుల వికాసానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. పుట్టుకతో లేదా బాల్యంలో పిల్లలకు వచ్చే వైకల్యాలను గమనించి తగిన వైద్యం అందిస్తే వారికి మెరుగైన జీవనాన్ని అందించినట్లు అవుతుందని మిగతా 2లో..

పాఠశాల స్థాయి నుంచే

దేశభక్తి అలవర్చుకోవాలి

◆ నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి
◆ ఉత్తేజంగా 'దేశభక్తిని చాటుదాం' బృందగాన పాటల పోటీలు



మాట్లాడుతున్న సిపి శంకబ్రత బాగ్చి, వేదికపై శర్మ తదితరులు



బృందగానం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలని, దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడ అప్పారావు సూక్తిని నిత్యం స్మరించుకుంటూ మానవత్వంతో మెలగాలని నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి అన్నారు. ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన దేశభక్తిని చాటుదాం బృందగాన పాటల పోటీలు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని చెప్పారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ దేశభక్తి అంటే దేశ సరిహద్దులను కాపాడటమే కాదని, మనుషుల అభివృద్ధి, సమైక్యత భావాన్ని అలవర్చుకొని అన్ని మతాలు, కులాల వారు అన్నదమ్ముల్లా జీవించడం అని అన్నారు. మతాల పేరుతో జరుగుతున్న కుతంత్రాలను అర్థం చేసుకుంటూ మెలగాలన్నారు. పాఠ్యాంశాలలో శాస్త్రీయ భావజాలాన్ని పక్కన పెట్టే కుట్రలు జరుగుతున్నాయని, వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఉన్నత చదువులకు ఎదుగుతూ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

దేశభక్తి అలవర్చుకోవాలి

ఆటపాటల్లో ఎప్పుడూ ముందుండాలని సూచించారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు 60 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ బృందగాన పోటీలు నిర్వహించామని చెప్పారు. సహకరించిన స్కూల్ యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు, పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.రమణ మాట్లాడుతూ దేశభక్తి పేరుతో కొందరు మతాల మధ్య చిచ్చు పెడుతూ, మనుషులను విడగొట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. నేటితరం విద్యార్థులు సమైక్యతా భావజాలంతో మెలగాలని ఆకాంక్షించారు. బృందగాన పోటీలలో గెలుపొందిన బృందాలకు సిపి శంకబ్రత బాగ్చీ జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు కె.సత్యనారాయణ, జి.స్టాలిన్, మౌలాలి, ఒ.విజయ, ఎం.నాగేశ్వరరావు, ఎన్వి.రమణ, కృష్ణార్జున, లీలావతి, లక్ష్మీనారాయణ, వై.అప్పారావు పాల్గొన్నారు. ముగింపు ఉత్సవంలో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు దేశభక్తిని ప్రబోధిస్తూ చక్కని నృత్య రూపకాలు ప్రదర్శించారు.

ఘనంగా స్పెషల్ ఒలింపిక్స్ ప్రారంభం

అన్నారు. విభిన్న ప్రతిభావంతుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసి, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు జెసిఐ వైజాగ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని సుమారు 50 పాఠశాలలకు చెందిన 900 మందిపైగా విభిన్న ప్రతిభావంతులు ఈ స్పెషల్ ఒలింపిక్స్‌లో పాల్గొన్నారు. తొలుత క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ కనుల పండుగగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్‌తోపాటు అతిథులుగా పాల్గొన్న శ్రావణ్ షిప్పింగ్ ఎమ్‌డి సాంబశివరావు క్రీడాకారుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులకు రన్నింగ్, షాట్ పుట్, జావలిన్ త్రో, సాఫ్ట్‌బాల్ వంటి 100కు పైగా క్రీడలలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఒలింపిక్స్ ప్రాజెక్ట్ చైర్మన్ ప్రభాకర్ బొట్టా, జెసిఐ వైజాగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్.చరిష్మా తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖబ్యూరో: విశాఖ నగరంలో సెప్టెంబర్ 5 నుండి 7 వ తేదీ వరకూ వైజాగ్ ఫుడ్‌ఫెస్టివల్ ను బీచ్ రోడ్డు, ద పార్క్ హోటల్ ప్రక్కనే గల ఎంజీఎం గ్రౌండ్స్ లో నిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ విసీ హాల్లో ఏర్పాటు చేసిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర రుచులతో పాటు జాతీయ అంతర్జాతీయ రుచులతో కూడిన ఫుడ్‌స్టాల్స్ మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా పర్యాటక శాఖ, హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మరియు ఈవెంట్ మేనేజర్ అసోసియేషన్స్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమానికి ప్రవేశం ఉచితమని తెలిపారు. సుమారు 30కి పైగా ఫుడ్‌స్టాల్స్ ఉంటాయన్నారు. సన్ స్కూల్ వారి ఆధ్వర్యంలో చెఫ్స్ అందరికీ కాంటెస్ట్ చేపట్టడం జరుగుతుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజు సుమారు 15 వేల నుండి 20 వేల మంది వరకు పాల్గొనే అవకాశం ఉందన్నారు. హెలికాప్టర్ మ్యూజియం ను ప్రారంభించామని, త్వరలో డబల్ డెక్కర్ బస్సులను కూడా ప్రారంభించడం జరుగుతుందన్నారు. యాత్రి నివాస్‌ను మరలా పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, అందులో గదులను ఆన్లైన్ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. వైజాగ్ ఫెస్టివల్ నిర్వహణకు సుమారు 15 లక్షల వరకు ఖర్చు అవుతుందని,టూరిజం శాఖ రూ. 5 లక్షలు, స్పాన్సర్ల ద్వారా కొంత మొత్తాన్ని, స్టాల్స్ ఏర్పాటుకు నామినల్ చార్జీలు వసూలు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. వాల్‌పోస్టర్‌ను టూరిజం శాఖ రీజనల్ డైరెక్టర్ జగదీష్, జిల్లా టూరిజం అధికారి మాధవితో కలసి ఆవిష్కరించారు

డిగ్రీ విద్యార్థుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: డిగ్రీ విద్యలో సింగిల్‌మేజర్ పద్ధతిని తొలగించి మూడు సబ్జెక్టుల కాంబినేషన్ తిరిగి ప్రవేశపెట్టాలని ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'ఛలో ఆంధ్రా యూనివర్శిటీ' కార్యక్రమం జరిగింది. భారీ సంఖ్యలో డిగ్రీ విద్యార్థులు ధర్నాలో పాల్గొన్నారు. ఉన్నత విద్యలో ప్రస్తుతం అమలులో ఉన్న సింగిల్ మేజర్ సబ్జెక్టు, కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్, ఇంటర్న్‌షిప్ వంటి మార్పులతో పాటు, ఇతర విధానాలపై విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు కె.అభిలాష్ మాట్లాడారు.

స్త్రీ శక్తితో మేలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వారి ఆర్థికస్వావలంబన కోసం స్త్రీశక్తి పేరిట మహిళలకు ఉచితబస్సు సర్వీసులను ప్రవేశపెట్టి, దేశంలోనే అత్యుత్తమ ప్రజానాయకుడిగా, పాలనాదక్షుడుగా పేరొందారని టిడిపి దక్షిణ నియోజకవర్గం ఇన్చార్జి,ఎన్టీఆర్ వైద్యసేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్ అన్నారు. శనివారం సాయంత్రం 35వ వార్డు పండావీధిలో దక్షిణ నియోజకవర్గంలోని 14 వార్డులకు చెందిన మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు బస్సులో నిలబడి ప్రయాణించకుండా రాష్ట్ర ప్రభుత్వం ఒకటి,రెండు నెలల్లో 1700 కొత్త పోస్టులను కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించారు.

యూరియా.. ఏదయా?

(మొదటి పేజీ తరువాయి..)

సన్నద్ధం కాలేదని విమర్శించారు. ప్రైవేట్ షాపులను ఆశ్రయించి రూ.350 నుంచి 400 ధరతో కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. అదే సమయంలో అధికారులు మాత్రం దీనికి భిన్నమైన అభిప్రాయం చెబుతున్నారు. ఎక్కడా ఎరువుల కొరత లేదని అంటున్నారు.

అసలు కారణమేంటి ?

మిక్సింగ్ కాంప్లెక్స్ ఎరువులు సకాలంలో సిద్ధం చేయలేకపోవడం వల్ల సమస్యలు వస్తున్నాయి. కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎరువుల కోటా తగినంతగా రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయమై గట్టిగా ప్రశ్నించడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే పంట దిగుబడులు తగ్గిపోతాయని రైతులు, రైతు సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విశాఖ జిల్లా పద్మనాభం మండలం వికె.పాలెం, కృష్ణాపురం, పాండ్రంగి గ్రామాల్లో రైతులు విస్తారంగా వరినాట్లు వేశారు. ఇక్కడి రైతులకు సకాలంలో యూరియా అందడం లేదు. రైతు సేవా కేంద్రాల వద్ద రైతులు ఎప్పుడు చూసినా బారులు తీరి కనిపిస్తున్నారు. ప్రైవేట్ డీలర్ల వద్ద కూడా యూరియా ఉందని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.వెంకటాచలం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

యూరియా దొరకడం లేదు

తుమ్మపాల, నాగులపల్లి, మునగపాక, తోటాడ ఇలా ఏ పిఎసిఎస్ కార్యాలయం వద్దకు వెళ్లినా ఎక్కడా యూరియా దొరకడం లేదు. ప్రయివేటులో అధిక ధరలకు అమ్ముతున్నారు. కేంద్రం సమయానికి సిద్ధం చేయకపోవడం దీనికి కారణం.

కర్రి అప్పారావు, ఎపి రైతు సంఘం
అనకాపల్లి జిల్లా అధ్యక్షులు

కొరత లేదు

ఎరువుల కొరత లేదు. అవసరం మేరకు అందిస్తున్నాం. యూరియా ఒక్కటే వేస్తే పంట దెబ్బ తింటుంది. పొటాషియం కలిపి మిక్సింగ్ వేసుకోవాలి. ఎకరాకు ఒకటిన్నర బస్తా యూరియా మిక్సింగ్‌తో వేయాలి.

మోహన్‌రావు,
జిల్లా వ్యవసాయాధికారి,
అనకాపల్లి

ఎరువుల కొరతపై ఆందోళన

ప్రజాశక్తి - మునగపాక : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతులకు సకాలంలో ప్రభుత్వం ఎరువులు అందజేయకపోవడాన్ని నిరసిస్తూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన రైతులు మునగపాకలోని ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో శనివారం ఆందోళన చేపట్టారు. వారినుద్దేశించి సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడారు. సకాలంలో యూరియా అందజేయకపోవడం తగదన్నారు. వర్షాలు కురిసి పంటలకు యూరియా అవసరమైన పరిస్థితుల్లో ఎరువులు లేక రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. రైతుల పక్షపాతి అని ఊదరగొట్టే కూటమి ప్రభుత్వం వారిని ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. మునగపాక మండల కేంద్రంలో రైతులకు 100 టన్నుల ఎరువులు అవసరముండగా కొరత నెలకొందన్నారు. ఈ పరిస్థితుల్లో అరకొరగా యూరియాను ప్రభుత్వం పంపిణీ చేసి చేతులు దులుపుకుందన్నారు. దీంతో అన్నదాతలు ప్రైవేట్ షాపులను ఆశ్రయించి రూ.350 నుంచి 400 ధరతో కొనే పరిస్థితి ఉందన్నారు. ఎరువుల సమస్యపై ఈ నెల 25న మండల తహశీల్దార్, వ్యవసాయ శాఖ కార్యాలయాల ఎదుట తమ సంఘం ఆధ్వర్యాన ఆందోళన చేపట్టనున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఎస్.బ్రహ్మాజీ, రైతులు బొడ్డేడ ముసలి నాగఅప్పారావు, పెంటకోట సాయి, ఆడారి యుగంధర్, వడిశెట్టి రమణ, ఆడారి గోవింద, దాడి సూరిబాబు, వెలగా సూరప్పారావు, విల్లూరి త్రినాధ, దొడ్డి నూకరాజు పాల్గొన్నారు.

'ఉక్కు' చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ ఉక్కును ప్రైవేట్ వాళ్లకు ఇచ్చేయాలంటే దాని చుట్టూ ఉచ్చు బిగిస్తే తప్ప అది సాధ్యం కాదని పాలకులు భావించినట్లుంది. ఈ క్రమంలోనే వారు ప్రైవేటీకరణ యత్నాలను ముమ్మరం చేశారు. స్టీల్ యాజమాన్యాన్ని రంగంలోకి దించారు. ఉక్కులోగల విభాగాలు, దగ్గర్లోగల ఆస్తులనూ ప్రైవేట్ వారికి కట్టబెట్టే చర్యలకు పూనుకుంటున్నారు. ఉక్కు ఫ్యాక్టరీలోని 34 విభాగాలను ముక్కలు ముక్కలుగా ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చేయడం, ఐదు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తూ రావడం, పర్మినెంట్ కార్మికులనూ వదలకుండా వారికి విఆర్ఎస్ ఇచ్చేసి వందల సంఖ్యలో బయటకు పంపేయడం వంటి చర్యలు ఇప్పటి వరకూ జరిగాయి. తాజాగా కూర్మన్నపాలెం జంక్షన్‌లోగల స్టీల్ సిటీ ఆర్‌టిసి డిపో లీజు అయిపోయిందనే నెపంతో ఈ డిపోను ఎత్తేసే కుట్రకు ఉక్కు యాజమాన్యం తెరతీసింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడి స్టీల్ సిటీ డిపోను 1992 జనవరి 24న ఏర్పాటు చేశారు. 33 ఏళ్లకు లీజు ఒప్పందం కుదిరింది. ఏటా రూ.8 లక్షలు చొప్పున 33 ఏళ్లకు రూ.2 కోట్ల 50 లక్షలు డిపాజిట్‌కు ఉక్కు యాజమాన్యానికి చెల్లించారు. తాజాగా లీజును పునరుద్ధరించాల్సి ఉండగా స్టీల్‌ప్లాంట్‌ను ఎలాగూ ప్రైవేట్ వారి చేతుల్లో పెట్టేసే చర్యలు ముమ్మరంగా అమలు చేస్తున్న కేంద్రంలోని బిజెపి, ఇక్కడి ఉక్కు యాజమాన్యం ఆర్‌టిసి డిపోను తొలగించేందుకు దిగడం విస్మయం కలిగించే అంశం.



కావాలనే షరతులు...

ఆర్‌టిసి స్థలాలను ప్రభుత్వం లీజులకే వదులుతున్న సంగతి తెలిసిందే. మరలా అగ్రిమెంట్ చేసుకోవచ్చు. కానీ ఉక్కును అమ్మేసేందుకు కూటమి పాలకులు సిద్ధం కావడంతో ఆంక్షలు, షరతులు పెట్టేస్తున్నారు. ఒకవేళ లీజు కొనసాగాలంటే ఆచరణలో సాధ్యం కాని విధంగా షరతు అంటే రూ.133 కోట్లు లీజుకు చెల్లించాలంటూ ఆర్టీసీపై ప్లాంట్ యాజమాన్యం చేత ప్రభుత్వం ఒత్తిడికి దిగడం తాజా పరిణామం. స్టీల్‌ప్లాంట్ ఆవరణలో ఈ డిపో ఉండడంతో ప్రస్తుతం పరిసర గ్రామాలకు రవాణా సులువుగా ఉంది. ఈ డిపో నుంచే రోజుకు 90 వేల మంది ప్రజలు ప్రయాణిస్తున్నట్లు ఆర్టీసీ అధికారుల లెక్కలు చెబుతు న్నాయి. ఇంతటి ప్రాధాన్యత కలిగిన డిపోను కాపాడుకునేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు రావడం లేదు.

మాతృభాష పరిరక్షణకు చర్యలేవీ ?

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : మాతృభాషా పరిరక్షణ విషయంలో కూటమి పాలకులు చేసింది ఏమీలేదని తెలుగుదండు సూరి ఎద్దేవా చేశారు. శనివారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలుగు భాష పరిరక్షణ విషయంలో గత ప్రభుత్వ అరాచకాలనే నేటి ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు. అయితే అధికారభాషా సంఘానికి మండలి వెంకట కృష్ణారావు పేరుతో వ్యవహరించాలని నిర్ణయం చేయడం సముచితం అన్నారు. భాషా పరిరక్షణకు సైతం కూటమి ప్రభుత్వం నడుం బిగించాలని లేనిపక్షంలో తెలుగుదండు కార్యాచరణ ఏమిటనే విషయాన్ని తర్వాత తెలియజేస్తామని చెప్పారు. సమావేశంలో ప్రముఖ సాహితీవేత్త డి.వి సూర్యారావు, పారిశ్రామికవేత్త కె.గంగరాజు, యువకవి నాగుల శ్రీనివాస్, రచయిత్రి ఉండవిల్లి సుజాత పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌పై సమావేశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టిరాజు చాంబర్‌లో న్యాయాధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లోక్‌అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించవచ్చని, ఇరుపక్షాలకు ఇది లాభదాయకమన్నారు. ముఖ్యంగా మోటారు వాహన ప్రమాదకేసులు, వివాహ సంబంధిత కేసులు, భూ తగాదాలు, బ్యాంకు రుణాల కేసులను లోక్‌అదాలత్ లో పరిష్కరించుకోవచ్చని ఆయన సూచించారు. సమావేశంలో విశాఖపట్నం జిల్లాలోని న్యాయమూర్తులు పాల్గొన్నారు. విశాఖపట్నం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు శనివారం నగరంలోని మానసిక సంరక్షణ ఆసుపత్రిని సందర్శించారు.

దావా సమను
మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి
(జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No. 287 / 2018

వాది: దాడి జగదీష్
ప్రతివాద్లు: కలవలపల్లి అప్పయ్యమ్మ (Died) వగైరాలు
టు:
6వ ప్రతివాది: కలవలపల్లి గణేష్‌కుమార్, తండ్రి రమణ, మామిడివాడ శివారు చినకలవలపల్లి గ్రామం, రాంబిల్లి మండలం, అనకాపల్లి జిల్లా.

దావా పరిహారం నిమిత్తం మీ మీదపైన వివరించిన వ్యాజ్యము వాది తెప్పించినందు వల్ల దావాకు ప్రత్యుత్తరము చెప్పగా అందు వలన **2025వ సం॥ ఆగస్టు నెల 25వ తారీఖున పగలు ఉ॥ 10-30 ని॥కు** స్వతహాగా లేక సరియైన భోగట్టా యివ్వబడిన వకీలు ద్వారాగా లేక సరిఅయిన ఏజెంటు మూలముగా ఈ కోర్టులో హాజరయ్యేటట్లు యిందువల్ల మీకు ఆజ్ఞాపించడమైనది. మీ ప్రతివాదమునకు ఆధారముగా వుద్దేశించి యుండే దస్తావేజులన్నింటినీ నీ యొక్క స్టేటుమెంటుతో సహా ఆరోజు హాజరుపర్చుటకు మీకు ఉత్తరువు చేయడమైనది.

పైన చెప్పిన దినమందు మీరు హాజరు కాకుండా తప్పినయెడల మీ పరోక్షమందు పై వ్యాజ్యమును విమర్శ చేసి తీర్మానించడ మగునని మీరు తెలుసుకోవలసినది.

యల్లపు దాసుబాబు
యలమంచిలి అడ్వకేటు, తులసీనగర్,
తే:23-8-25 యలమంచిలి-531055

ఫర్నీచర్ వితరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న కోలోకేటెడ్ పిహెచ్‌సికి దివీస్ ఆధ్వర్యంలో శనివారం ఫర్నిచర్ అందజేశారు. 80 కుర్చీలు, టేబుళ్లు, అలమర తదితర సామగ్రిని అందజేశారు. దివీస్ యాజమాన్యానికి వైద్యులు కల్యాణి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఫణికుమార్, సిఎస్ఆర్ ఇన్‌ఛార్జి ఎ.శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కెజిబివిలో 'ప్రకృతి పథ్'

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో గిటామ్ యూనివర్సిటీ విద్యార్థుల ఆధ్వర్యాన నడుస్తున్న ప్రవిద, రివైవ్ ఈకోటెక్ స్టార్టప్‌లు, ఉమెన్స్ లీడర్ ఫోరంతో కలిసి 'ప్రకృతి పథ్' ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సస్టైనబిలిటీ, వ్యర్థాల నిర్వహణ, మాసిక శుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంతో పాటు నాయకత్వం, సామాజిక బాధ్యతపై చైతన్యం కలిగించారు. సమగ్ర శిక్షా విశాఖపట్నం అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జె.చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మొక్క నాటి, 'ఒక విత్తనం ఉద్యమం' ప్రారంభించారు. కెజిబివి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వ్యర్థాల వర్గీకరణ, కంపోస్టింగ్, వర్షాకాల పరిశుభ్రత, మాసిక ఆరోగ్యం (అవాస్తవాలు - నిజాలు)పై చర్చించారు. ఆటలు, కథలు, వినోదాత్మక కార్యక్రమాలతో అవగాహన తరగతులు సాగాయి. అనంతరం విద్యార్థులకు విత్తనాలు పంపిణీ చేసి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రవిద వ్యవస్థాపకుడు మనీష్ బుసరమోని, రివైవ్ ఈకోటెక్ వ్యవస్థాపకుడు కొట్టిస సంపత్, లస్య శర్మ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా స్థానిక ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి డి.సౌజన్య హాజరై ఎస్‌సి, ఎస్‌టి, అట్రాసిటీ, ఫోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. సంబంధిత చట్టాలు తమను తాము రక్షించుకోవడానికే గానీ ఇతరులపై కక్ష తీర్చుకోవడానికి ఉపయోగించరాదని స్పష్టం చేశారు. ఎస్ఐ ఎన్.గౌరి మాట్లాడుతూ, మహిళలకు ఉన్న ప్రత్యేక హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.జనార్ధనరావు, కార్యదర్శి మంజుల, పాల్గొన్నారు.

వినాయక చవితికి డిజెలు వద్దని వినతి

ప్రజాశక్తి- ములగాడ : వినాయక చవితికి మట్టి వినాయకుడిని మాత్రమే పూజించాలని, అధిక ధ్వనితో డిజెలు పెట్టకూడదని, అసభ్యకర పాటలు ఆలపించ కూడదని కోరుతూ పిలకవానిపాలెంలోని లక్ష్మీ అమర ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థినులు గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ షేక్ నజీర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎ.వాసుదేవరావు, ఇన్‌ఛార్జి అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి ఆమోదం

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 52వ వార్డు పరిధి మర్రిపాలెం ఉడా లే-అవుట్ ప్రాంతంలోని పిపిపి పార్కులో కొత్తగా స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం తెలిపిందని మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తెలిపారు. పిఎఫ్ ఆఫీసు క్వార్టర్ల నుంచి రజకవీధి, పాత పోలీస్ క్వార్టర్స్ మీదుగా కరాస శ్మశాన వాటిక వరకు డ్రెయిన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు శ్రీధర్ తెలిపారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

ప్రజాశక్తి-మధురవాడ : స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో నష్టపోతున్న ఆటో రిక్షా కార్మికులను ఆదుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిఐటియు అనుబంధ విశాఖ జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం కోరింది. ఇప్పటికే అరకొర ఆదాయాలతో జీవిస్తున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలు ఈ ఉచిత బస్సు పథకం అమలు తర్వాత పూర్తిగా ఇబ్బందులకు గురవుతున్నాయని తెలిపారు. ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం కొమ్మాది జంక్షన్ నుంచి రైతు బజారు, మధురవాడ వంతెన కింది నుండి జివిఎంసి జోనల్-2 కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ జోన్ ప్రధాన కార్యదర్శి పి.రాజుకుమార్ మాట్లాడుతూ, ఆటో కార్మికులకు గత ప్రభుత్వం రూ.10 వేలు ఇచ్చేదని, కూటమి నాయకులు రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ అమలు చేయలేదని తెలిపారు. ఆర్‌టిఏ చలనాలు, జరిమానాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆటో రిక్షా కార్మికులను ఆదుకునే చర్యలు తక్షణమే చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి.చిన్నారావు, బి.నాగేశ్వరరావు, ఎం.రాము, ఎస్.ప్రసాద్, దుర్గారావు, సంతోష్, పాల్గుణరావు, పి.సూరిబాబు, గౌతమ్ పాల్గొన్నారు.

అధికారుల బెదిరింపులు

ప్రజాశక్తి - పద్మనాభం : తమ భూములకు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ మండలంలోని కృష్ణాపురం గ్రామంలో నాలుగు రోజులుగా సిపిఎం ఆధ్వర్యాన వంటా వార్పు నిర్వహిస్తున్న 60 మంది రైతులపై అధికారులు హుకుం జారీచేస్తున్నారు. మండల రెవెన్యూ సిబ్బంది, పద్మనాభం పోలీసులు రోజుకు రెండు మూడు సార్లు వచ్చి శిబిరాన్ని ఎత్తివేసి పద్మనాభం తహశీల్దార్ కార్యాలయానికి రావాలని ఆదేశిస్తున్నారు. దీనికి రైతులు స్పందిస్తూ గ్రామంలో గ్రామ సభ పెట్టి రైతులు, గ్రామ పెద్దలు ఆమోదం తీసుకోవాలని కోరుతున్నారు. 60, 70 సంవత్సరాల నుండి మొక్కలు పెంచి ఫల సాయం పొందుతున్నామని, ఇప్పుడు భూ సేకరణ పేరుతో భూములను అన్యాయంగా తీసుకోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. భూమికి నష్టపరిహారాన్ని చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

తహశీల్దార్ వివరణ

మండలంలోని కృష్ణాపురం గ్రామకంఠంలో ఉన్న 88, 90, 93 సర్వే నంబర్లలో ఉన్న 66 ఎకరాలను ఎన్‌విఎస్‌వి పార్కు నిర్మాణం కోసం ప్రభుత్వం ఆదేశాల మేరకు భూ సేకరణ చేసినట్లు తహశీల్దార్ కె.ఆనందరావు తెలిపారు. సాగులో ఉన్న రైతులు దీన్ని అడ్డగించారని, దీనిపై గ్రామ సభ నిర్వహించాలని జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు.


వంటా వార్పు చేసి భోజనాలు చేస్తున్న రైతులు

జన్యుపరిజ్ఞానంపై సిఎమ్ఇ

ప్రజాశక్తి-మధురవాడ : మానవ జన్యు పరిజ్ఞానంపై వైద్యులకు సమగ్ర అవగాహన కలిగించడానికి గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) అనాటమీ విభాగం ఆధ్వర్యాన 'జీన్స్, ఆకృతి -లోపాలు' అనే అంశంపై కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సిఎమ్ఇ) కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 21 వైద్య కళాశాలల నుంచి వైద్యులు హాజరయ్యారు. వివిధ సంస్థల అధిపతులు, ప్రొఫెసర్లు, వైద్య విద్యను అభ్యసిస్తున్న పీజీ, అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని జిమ్సర్ ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు, ఎస్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్ డాక్టర్ సుధాకర్ ప్రారంభించి మాట్లాడుతూ, మానవ జన్యుపరమైన విజ్ఞానానికి సంబంధించిన క్లినికల్ అనువర్తనాలపై వైద్య నిపుణుల పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు, ముఖ్యంగా నిర్ధారణ ఖచ్చితత్వం, నైతిక నిర్ణయాలు, రోగి కేంద్రిత సంరక్షణపై దృష్టి సారించడానికి నిరంతర వైద్య విద్య ఉపయోగపడుతుందన్నారు. జిమ్సర్ అనాటమి విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్యామ్యూల్ ఫ్రాంక్ స్టీఫెన్, హైదరాబాద్‌కు చెందిన సిడిఎఫ్‌డి (సెంటర్ ఫర్ డిఎన్ఎ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్) సైటోజెనటిసిస్ట్ డాక్టర్ ఉషా దత్తా క్లినికల్ ప్రాక్టీస్‌లో సైటోజెనెటిక్ విశ్లేషణపై ప్రసంగించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ కేన్సర్ బయాలజీ ల్యాబ్ ప్రొఫెసర్ మళ్ల రామారావు డిఎన్ఎ ఎక్స్‌ట్రాక్షన్‌పై ప్రాక్టికల్ వర్క్‌షాప్ నిర్వహించారు. హోమీ బాబా కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన హిమటోపథాలజిస్ట్ డాక్టర్ అనుమేహ చతుర్వేది, సిడిఎఫ్‌డి డయాగ్నోస్టిక్స్ విభాగాధిపతి డాక్టర్ అశ్విన్ దలాల్ అరుదైన శిశు వ్యాధులపై మాలిక్యులర్ అవగాహనల గురించి ప్రసంగించారు. అనాటమీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ పద్మిని మిశ్రా, థెర్మో ఫిషర్ కంపెనీకి చెందిన చైతన్య వేగి ఆధునిక మాలిక్యులర్ సాంకేతికతలపై వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా భవిష్యత్తులో వైద్య విద్యార్థులకు జన్యుశాస్త్రాన్ని ఎలా బోధించాలి అనే అంశంపై డాక్టర్ బి.గీతాంజలి సంధానకర్తగా చర్చా కార్యక్రమం నిర్వహించారు. వివిధ విభాగాల నిపుణులు హాజరై జన్యుశాస్త్ర భవిష్యత్తు, వైద్యశాస్త్రం, విద్య రంగాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.


వికలాంగుల పెన్షన్లు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండల పరిధిలోని 26 పంచాయతీలలో తొలగించిన వికలాంగుల పెన్షన్లను పునరుద్ధరించాలని వికలాంగుల సంఘం అధ్యక్షులు కొత్తలంక దేముడు డిమాండ్‌చేశారు. పలువురు వికలాంగుల పెన్షన్లు తొలగించగా, మరికొందరికి వికలాంగ శాతం తగ్గించారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమస్యలపై ఈ నెల 25వ తేదీన కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించనున్నామని, ఆనందపురం మండలంలోని వికలాంగులు అందరూ హాజరుకావాలని కోరారు.

నేరాలు ఘోరాలు

తీరంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

ప్రజాశక్తి - ఆరిలోవ : సాగరతీరం తెన్నేటి పార్కు బీచ్‌కు గుర్తు తెలియని మహిళ మృతదేహం శనివారం మధ్యాహ్నం కొట్టుకొచ్చింది. ఆమెకు సుమారు 45 నుంచి 50 ఏళ్లు ఉంటాయని అంచనా. స్థానికుల సమాచారం మేరకు ఆరిలోవ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి కెజిహెచ్ శవాగారంలో భద్రపరిచారు.


కంప్యూటర్లు, ప్రింటర్ అందుకున్న ప్రిన్సిపల్, విద్యార్థులు

కంప్యూటర్, ప్రింటర్ అందజేత

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ విద్యార్థుల సౌకర్యార్థం శనివారం విశాఖ కు చెందిన ఎక్స్ టి గ్లోబల్ ఇన్ఫోటెక్ లిమిటెడ్ సంస్థ జిఎం వి.సుబ్బారావు రెండు కంప్యూటర్లు, ప్రింటర్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీవాణికి అందజేశారు. ఇందుకు గాను ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులు సంస్థ జిఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

సురవరం సుధాకరరెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి -తగరపువలస : సిపిఐ సీనియర్ నేత, ఆ పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన సురవరం సుధాకరరెడ్డి మృతి పట్ల స్థానిక సిపిఐ నాయకులు శనివారం ప్రగాఢ సంతాపం తెలుపుతూ, ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కానూరు రాంబాబు, మోర అప్పలరాజు, ఎం.వీర్రాజు, ఆదినారాయణ, రాంపైడి తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో డిప్యూటీ కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి, ఎన్‌హెచ్ 16 డిప్యూటీ కలెక్టర్ కె.జ్ఞానవేణి శనివారం పర్యటించారు. ముందుగా పద్మనాభ మండల కాంప్లెక్స్‌లో జరిగిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొని వర్షాకాలం - పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. రేవిడి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. పద్మనాభం ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో ఎంఐఎం సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.ఆనందరావు, పంచాయతీ విస్తరణాధికారి కుమారి, మండల రెవెన్యూ అధికారి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

'డిపాల్' వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాశక్తి-ఉక్కునగరం : తమ నుంచి వేలకు వేలు ఫీజులు కట్టించుకొని పిల్లలకు సరిగ్గా విద్యాభ్యాసాలు చెప్పటం లేదంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఉక్కు నగరంలోని డీ పాల్ పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. ఫీజు కట్టి వెళ్లిపోవటం తప్ప ఎలాంటి ప్రశ్నలు వేయకూడదని విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం చెప్పటంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం పెద్ద ఎత్తున విద్యార్థులు తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకొని లోపలికి వెళ్లడానికి ప్రయత్నించారు. ప్రిన్సిపాల్‌ను కలవడానికి సిబ్బంది అనుమతించలేదు. దీనిపై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరించారు.

అప్పన్నను దర్శించుకున్న మేయర్

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి మేయర్ పీలా శ్రీనివాసరావు, 98వ వార్డు కార్పొరేటర్ పివి.నరసింహం శనివారం సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధ, సహాయ కార్యనిర్వాహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు, అర్చకులు స్వాగతం పలికారు. మేయర్ ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం స్వామివారి మూల విరాట్టును దర్శించుకున్నారు. తరువాత స్వామివారి శేష వస్త్రాన్ని అందజేసి సత్కరించారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటాలే శరణ్యం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్/మాధవధార : కార్మిక వర్గ పోరాటాలపై నిర్బంధాలు, కార్మిక హక్కుల కాలరాయడానికి కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణం అవుతున్నాయని వాటిని ఎదుర్కొనేందుకు పోరాటాలు తప్ప మరో మార్గం లేదని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు - నిర్బంధాలు - పోరాటాలు కొనసాగింపు' అంశంపై సిఐటియు విశాఖ జిల్లా కమిటీ, డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ సంయుక్తంగా శనివారం కంచరపాలెంలోని బొట్టా నరసింగరావు భవనంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. 1991 నుండి ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల్లో భాగంగా ప్రవేశపెట్టబడిన నూతన ఆర్థిక విధానాలతో కార్మిక హక్కులపై దాడులు పెరిగాయని వివరించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా 1992 నుండి నేటి వరకు పోరాటాలు కొనసాగుతున్నాయని, అందుకే ప్రభుత్వాలు అమలు జరపాలనుకున్న విధానాలను అమలు జరపలేకపోయాయని, పబ్లిక్ రంగ సంస్థలను అమ్మలేకపోయాయని తెలిపారు. కొత్త కొత్త రూపాలలో నిర్బంధాలను కొనసాగిస్తున్నాయని తెలిపారు. అందులో భాగంగానే స్టీల్ ప్లాంట్‌లో 5000 మందిని, విశాఖ డెయిరీలో 305 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారని, ఎన్ఎడిలో 36 మంది కార్మికులను సస్పెండ్ చేశారని తెలిపారు. ఈ నిర్బంధాలను ఎదిరించాలంటే పోరాటం తప్ప మరొక మార్గం లేదన్నారు. ఇటీవల కాలంలో తమిళనాడులో శ్యాంసంగ్ కార్మికులు, బెంగళూరులో ఐటి ఉద్యోగులు పోరాటాలే దీనికి నిదర్శనమన్నారు. విశాఖలో నాలుగు సంవత్సరాలుగా సాగుతున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యమం, ఎన్ఎడిలో మూడు నెలలు సాగిన పోరాటాలు ఉదాహరణ అని వివరించారు.

ఐఎన్‌టియుసి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం మాట్లాడుతూ, సమస్యలు వచ్చినప్పుడు పరిశ్రమలలో ఉన్న ట్రేడ్ యూనియన్లు జెండాలు పక్కన పెట్టి ఒకే ఎజెండాతో పోరాటాన్ని కొనసాగించాలని, అప్పుడు తప్పకుండా విజయం సాధించగలమని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యమంలో అన్ని ట్రేడ్ యూనియన్లు కలిసి ఉండబట్టే ఇప్పటివరకు అమ్మకాన్ని అడ్డుకోగలిగామని, ఎన్ఎడి కార్మికులు సస్పెండ్ అయినప్పుడు ఆ ఉద్యమానికి జిల్లాలో ఉన్న ట్రేడ్ యూనియన్లు మద్దతు ఇచ్చాయి కనుక విజయం సాధించగలిగామని తెలిపారు.

ఎఐడిఇఎఫ్ అఖిల భారత కార్యవర్గ సభ్యులు పి.గోపాలకృష్ణ మాట్లాడుతూ, రక్షణ రంగంలో కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ భారీ ఎత్తున సాగుతోందని, వాటి కొనసాగింపునకు అడ్డంకి లేకుండా యూనియన్ నాయకులు, కార్మిక ఉద్యమాలపై నిర్బంధం కొనసాగుతుందని తెలిపారు. సదస్సుకు అధ్యక్షత వహించిన డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ, ఎన్ఎడి మేనేజ్‌మెంట్ కార్మిక సంఘాలను చూసి భయపడుతోందని, అందుకే పిరికిపంద చర్యలు చేపడుతోందని చెప్పారు. సస్పెండ్ అయిన కార్మికుల్ని కంపెనీ క్వార్టర్స్‌లోనికి రావద్దని, కాపురం చేయొద్దని చెప్పడం భారత రాజ్యాంలోని ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే కాదు.. మానవ హక్కుల ఉల్లంఘనే అని చెప్పారు. ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ సిస్టం వ్యతిరేకించినందుకు 40 మంది జీతాలతో పాటు 400 మందికి లీవులు కట్ చేయడం చట్ట వ్యతిరేకమని, రాజ్యాంగ హక్కులను తుంగలో తొక్కి, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న ఎన్ఎడి చీఫ్ జనరల్ మేనేజర్‌పై తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్ఎడి యాజమాన్యం నిర్బంధాన్ని ఆపకపోతే అన్ని ట్రేడ్ యూనియన్లను కలుపుకొని పోరాటానికి సిద్ధమవుతామని తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సదస్సు తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సభలో టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి పి.జగ్గారావు, డిఐటియు అధ్యక్షులు చిట్టిరాజు, సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.నాగేశ్వరరావు మాట్లాడారు. అధిక సంఖ్యలో రక్షణ రంగ కార్మికులు హాజరయ్యారు.



సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి.కుమార్

మహాధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31వ తేదీన చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఉదయం 8 గంటల నుంచి అగనంపూడి కాలనీ, కొండయ్యవలస, కో-ఆపరేటివ్ స్టోర్స్, జగదాంబ జంక్షన్ నుంచి బైక్ ర్యాలీ చేపడతామని, అదే సమయంలో వడ్లపూడి ముస్తఫా జంక్షన్ నుంచి బైక్ ర్యాలీ, పెదగంట్యాడ గాంధీ బొమ్మ జంక్షన్ నుంచి బైక్ ర్యాలీ చేపడతామని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. 8 గంటలకు పెదగంట్యాడ జంక్షన్ నుంచి పాదయాత్ర, ఉక్కునగరంలో ఉదయం 7 గంటలకు రైతు బజార్ వద్ద ప్రచారం చేస్తామని పేర్కొన్నారు. ఉక్కు నగరంలో సెక్టర్-3 వరకు బైక్ ర్యాలీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కోరారు.

ఐవిఎఫ్ కేంద్రాల్లో తనిఖీ

ప్రజాశక్తి-సీతమ్మధార : నగరంలోని ఐవిఎఫ్, ఫెర్టిలిటీ కేంద్రాలను డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు అధ్యక్షతన 7 మందితో కూడిన ఎఆర్‌టి, సరోగసి బృంద సభ్యులు పరిశీలించారు. డాక్టర్ నీరజాస్ మామ్స్ హోప్ ఫెర్టిలిటీ కేంద్రం, ఆరాధ్య ఐవిఎఫ్ కేంద్రం, రామ హాస్పిటల్, ఆకర్ష్ ఫెర్టిలిటీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆపరేషన్ థియేటర్, వార్డ్, స్కానింగ్ మెషిన్లను పరిశీలించారు. డాక్టర్లు, స్టాఫ్ విద్యార్హతలు, ల్యాబ్ పరికరాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో డాక్టర్లు విద్యారమ, రాధ, టి.కిషోర్, సోభశ్రీ, సోషియాలజిస్ట్ ఎల్‌వి.రమణి, కె.శివాజీ, డాక్టర్ బి.ఉమావతి, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ, మలేరియా నివారణపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి- గోపాలపట్నం : డెంగీ, మలేరియా నివారణపై అధికారులు, ప్రజలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రభుత్వ విప్ పెతకంశెట్టి గణబాబు సూచించారు. జివిఎంసి 91వ వార్డు పరిధి బాజీజంక్షన్ వద్ద జాతీయ డెంగీ, మలేరియా నివారణ మాసోత్సవాలను జివిఎంసి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటి నిల్వల్లో డెంగీ క్రిములు పెరగకుండా డ్రైడే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ అప్పలనాయుడు, కూటమి నేతలు నారిపిన్ని సత్తిరాజు, నరవ అనూష, ఉప్పెటి శివ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసిరావు, దాలినాయుడు పాలొన్నారు.


జివిఎంసి 92వ వార్డు పరిధి మేఘాద్రిగెడ్డ బాలయోగి గురుకుల పాఠశాల వద్ద జాతీయ మలేరియా, డెంగీ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ప్రియదర్శిని వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కంపర ఆనంద్, జీన్స్‌వేర్ రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపి పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార : సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన రూ.4.70 లక్షల చెక్కులను బాధితులకు శనివారం ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారు తన కార్యాలయంలో సంప్రదించి ఒరిజినల్ బిల్స్ ఇస్తే సిఎం రిలీఫ్ ఫండ్ అందేలా చూస్తామని తెలిపారు. స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయన్నారు. దీనిపై వైసిపి రాజకీయ భవిష్యత్తు కోసం తప్పుడు ప్రచారాలు చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో శ్యామల దీపిక తదితరులు పాల్గొన్నారు.

'దుర్గా గణపతి' కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : శ్రీ దుర్గా గణపతి దేవస్థానం నవరాత్రులు ఈనెల 27 నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రమాబాయి తెలిపారు. సీతంపేటలోని దుర్గాగణపతి ఆలయం ఆవరణలో శనివారం ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకుడు, స్థానిక వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవిందు మాట్లాడుతూ, సెప్టెంబర్ 5వ తేదీన గణనాథుని ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.


దుర్గా గణపతి నవరాత్రుల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గోవింద్ తదితరులు

తాగునీరు కల్పించాలి



సిపిఎం ఆధ్వర్యాన జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాలనీ వాసులు

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 94వ వార్డు పరిధి చైతన్యనగర్ బంటా కాలనీలో నివసిస్తున్న ప్రజలకు తాగునీరు కల్పించాలని సిపిఎం గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి.జగన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జోన్-8 కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, 2007 నుంచి సుమారు 50 కుటుంబాలు చైతన్యనగర్ బంటాకాలనీలో నివసిస్తున్నారని, వీరిలో అత్యధిక మంది భవన నిర్మాణ, ఇతర అసంఘటితరంగ కార్మికులేనని తెలిపారు. గత 15 రోజులుగా నీరు లేక కనీస అవసరాలు తీర్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారని, వాటర్ ట్యాంకు ద్వారానైనా నీటిని పంపించాలని కోరారు. శాశ్వత పరిష్కారం కోసం బోర్, లేదా పైప్ లైన్ వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటలక్ష్మి, బి వెంకటరావు, కె.అప్పలనాయుడు, సురమ్మ, ప్రసాద్, లక్ష్మి, ప్రభుదేవా, రాజు పాల్గొన్నారు.

'బుల్లయ్య'లో అంతరిక్ష దినోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఇసిఇ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ జె.బాబు మాట్లాడుతూ చంద్రయాన్, మంగళయాన్, గగన్యాన్ వంటి విజయాలు భారత అంతరిక్ష పరిశోధనలో చారిత్రాత్మక ఘట్టాలు అని, ఇవి యువతకు స్ఫూర్తినిస్తూ, సాంకేతిక రంగంలో కొత్త ఆవిష్కరణలకు దారితీస్తున్నాయని తెలిపారు. ఇసిఇ సహాయ విభాగాధిపతి డాక్టర్ కెవి.రమణారావు మాట్లాడుతూ, అంతరిక్ష పరిశోధన రాకెట్ ప్రయోగాలకు మాత్రమే పరిమితం కాదని, టెలికమ్యూనికేషన్, వ్యవసాయం, వాతావరణ సూచనలు, జాతీయ భద్రత వంటి విభాగాలలో కూడా కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. విద్యార్థులు ఈ రంగంలో ముందడుగు వేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకుంటూ: "భవిష్యత్తులో అంతరిక్ష పరిశోధనలో భాగస్వాములై దేశానికి సేవ చేయాలని ఆశిస్తున్నాం' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్టర్ ప్రదర్శనలు, క్విజ్ పోటీలు, సాంకేతిక ప్రదర్శనలు నిర్వహించారు.

ఉచిత విద్యుత్‌కు దరఖాస్తు

ప్రజాశక్తి- వేపగుంట : ప్రభుత్వ సెలూన్ షాపునకు కల్పించిన ఉచిత విద్యుత్‌ను పొందేందుకు అందరూ దరఖాస్తు చేసుకోవాలని నాయి బ్రాహ్మణ సేవా సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు నరవ పైడిరాజు కోరారు. 200 యూనిట్లు ఉచిత విద్యుత్ కోసం జిల్లాలో ఉన్న నాయీ బ్రాహ్మణ సభ్యులు సెలూన్ షాప్స్ లేబర్ సర్టిఫికెట్, కులం, ఆదాయం, ఒరిజినల్ కరెంట్ బిల్, షాప్ అగ్రిమెంట్ కాపీ, ఆధార్ జెరాక్స్, నాయీ బ్రాహ్మణుడితో కలిసి ఉన్న షాప్ ఫొటో, తమ షాపునకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను కల్పించాలని కోరుతూ ఎఇకి లెటర్ రాస్తూ, జిఒ కాపీని జతచేసి అందించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98850 71617 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

తంగా శ్రీనివాసరావుకు ఎయు పిహెచ్‌డి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తంగా శ్రీనివాసరావు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 'భారతదేశంలో పట్టణ పరిపాలన : గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌పై అధ్యయనం' అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ప్రభుత్వ పాలనా శాస్త్రం)లో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పిహెచ్‌డి పట్టా దక్కింది. ఎయు విసి ప్రొఫెసర్ జిపి.రాజశేఖర్ శనివారం జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావుకు ఆ పట్టాను ప్రదానం చేశారు. శ్రీనివాసరావు తన పరిశోధనను ఎయు రాజనీతి శాస్త్ర, ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ పి.ప్రేమానందం మార్గదర్శకత్వంలో పూర్తి చేశారు. ప్రస్తుతం శ్రీనివాసరావు గిరిజన సహకార సంస్థ (జిసిసి)లో సీనియర్ మేనేజర్‌గా (డెప్యూటేషన్‌పై) విధులు నిర్వహిస్తున్నారు. అంతకుముందు ఆయన తాడేపల్లిలోని ఎపి ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బోర్డులో డిప్యూటీ సెక్రటరీగా సేవలందించారు. విద్యా రంగంలో శ్రీనివాసరావు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ సంపాదించి, యుజిసి నెట్‌లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అర్హత సాధించారు. అదేవిధంగా ఆయన పొలిటికల్ సైన్స్‌లో మరో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసి ఆ విభాగంలో కూడా యుజిసి-నెట్ అర్హత సాధించారు. పిహెచ్‌డి పట్టా ప్రదాన కార్యక్రమంలో ఎయు ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు, ప్రొఫెసర్ ప్రేమానందం, డాక్టర్ టి.నాగరాజు, డాక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు. శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలుపుతూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.


తంగా శ్రీనివాసరావుకు పిహెచ్‌డిని అందిస్తున్న విసి రాజశేఖర్

డిఎస్‌సి ఫలితాల్లో సత్తా

ప్రజాశక్తి-దేవరాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో దేవరాపల్లి మండలానికి చెందిన పలువురు అభ్యర్థులు తమ సత్తాను చాటి ప్రభుత్వ కొలువులకు అర్హత సాధించారు.

ఎస్జిటిలో 23వ ర్యాంకు సాధించిన రవి



దేవరాపల్లికి చెందిన కాటపల్లి రవిశంకర్ ఎస్‌జిటిలో 89.99 మార్కులతో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఓపెన్ క్యాటగిరీలో 23వ ర్యాంకు సాధించాడు. తన తల్లి మంగమ్మ అకాల మరణం చెందగా, తండ్రి అచ్చిబాబు రోజువారి కూలి పనులు చేస్తూ రవిశంకర్‌ను చదివించాడు. తన కష్టానికి తగిన ఫలితాన్ని తన కుమారుడు సాధించాడంటూ తండ్రి అచ్చిబాబు ఆనందం వ్యక్తం చేశాడు. భవిష్యత్తులో సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని రవి చెప్పారు.

ఒకేసారి రెండు ఉద్యోగాలు



దేవరాపల్లి మండలం ఎం.అలమండకు చెందిన కామిరెడ్డి రాధా ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కానిస్టేబుల్ రిక్రూట్మెంట్‌లో సిటీ సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. తాజాగా ప్రభుత్వం వెల్లడించిన డీఎస్సీ ఫలితాల్లో 86.09 మార్కులు సాధించి ఉమ్మడి విశాఖ జిల్లాలో 69 ర్యాంకు ఎస్జీటీ ఉద్యోగానికి ఎంపికైంది. సామాన్య రైతు కుటుంబానికి చెందిన రమణ, రాజులమ్మ కుమార్తె రాధా భవిష్యత్తులో జూనియర్ లెక్చరర్‌గా కొలువు సాధించడమే తన లక్ష్యమని పేర్కొంది.

62వ ర్యాంకు సాధించిన శ్వేత



మండలంలోని మారేపల్లికి చెందిన సియాద్రి మంజీరా శ్వేత జిల్లాలో ఉన్న ఎస్సి-సి సామాజిక వర్గానికి కేటాయించిన ఒకే ఒక హిందీ పోస్ట్‌ను పొందేందుకు అర్హత సాధించింది. 66.78 మార్కులతో ఉమ్మడి విశాఖ జిల్లాలో 62 ర్యాంకును సాధించి తన సత్తా చాటింది. తల్లి సన్యాసమ్మ అంగన్వాడీ బోధకురాలు కాగా, తండ్రి త్రినాధరావు ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు.

శివకు 55వ ర్యాంకు

మండలంలోని నాగయ్యపేటకు చెందిన కొడమంచిలి శివ డీఎస్సీ ఫలితాల్లో 86.63 మార్కులు సాధించి ఉమ్మడి విశాఖ జిల్లాలో 55 ర్యాంకులో నిలిచి ఎస్జీటీ కొలువుకు సాధించాడు. తండ్రి అప్పారావు తన కులవృత్తి చేసుకుంటూ కుమారుడిని చదివించాడు.

పిఈటి కొలువు సాధించిన దుర్గారావు



మండలం లోని నాగయ్యపేటకు చెందిన చుక్కా దుర్గారావు ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనర్ అర్హత పరీక్షల్లో 85 మార్కులు సాధించి 13వ ర్యాంకుతో పిఈటి కొలువుకు ఎంపికయ్యాడు.

7వ ర్యాంకు సాధించిన లావణ్య



నక్కపల్లి : డీఎస్సీ ఫలితాల్లో మండలంలో గొడిచర్ల గ్రామానికి చెందిన చెల్లపు లావణ్య ఎస్‌జిటి విభాగంలో 91 శాతం మార్కులతో జిల్లాలో ఏడవ ర్యాంకు నిలిచింది. గొడిచర్ల గ్రామంలో వ్యవసాయ కుటుంబానికి చెందిన హనుమంతరావు, నాగమణి దంపతులకు జన్మించిన లావణ్య గొడిచర్ల ప్రభుత్వ పాఠశాలలోనే చదువు పూర్తి చేసుకుంది.

రామకృష్ణకు 2వ ర్యాంకు



దోసలపాడు గ్రామానికి చెందిన భవిరిశెట్టి రామకృష్ణ సోషల్ స్కూల్ అసిస్టెంట్‌లో రెండో ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు భవిరిశెట్టి నాగేశ్వరరావు, మంగ చిన్నతనంలోనే మరణించారు. ప్రాథమిక విద్య దోసలపాడు గ్రామంలో పూర్తిచేసి ఉన్నత విద్య గొడిచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో పూర్తి చేశారు. తన అన్నయ్య, నాన్నమ్మ, అమ్మమ్మల సహకారంతో డిగ్రీ పూర్తి చేసి తదుపరి బి.ఎడ్ పూర్తి చేసి ఉపాధ్యాయ ఉద్యోగాన్ని సాధించాడు.

3వ ర్యాంకు సాధించిన నాగేశ్వరరావు



మండలంలో గొడిచెర్ల గ్రామానికి చెందిన కర్రి రాజు నాగేశ్వరరావు బైక్ సీటు కవర్లు షాప్ పెట్టుకుని పని చేసుకుంటూ బి.ఎడ్ పూర్తి చేసి డీఎస్సీలో విశాఖ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ విభాగంలో 3వ ర్యాంక్ సాధించాడు. వీరే కాకుండా డొంకాడలో ప్రగడ సురేష్, ఎస్జీటీ విభాగం లో 133 వ ర్యాంక్ సాధించాడు. డొంకాడకు చెందిన సంతోష్ డీఎస్సీలో ఎస్‌జిటి విభాగం లో 178 వ ర్యాంక్ సాధించాడు.

ఒకే గ్రామంలో ముగ్గురికి పోస్టులు



గంజి రవి

చీడికాడ : మెగా డీఎస్సీలో బయలుపూడి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు విజయకేతనం ఎగరవేశారు. గ్రామానికి చెందిన గంజి రవి మెగా డిఎస్సిలో ఉమ్మడి విశాఖ జిల్లా సోషల్ స్కూల్ అసిస్టెంట్‌లో మొదటి ర్యాంకు సాధించారు. డిగ్రీలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్సులో చదివి తర్వాత బీఈడీ, ఎంఏ ఎంఈడి ఆంధ్రా యూనివర్సిటీలో పూర్తి చేశాడు. టీచర్ ఉద్యోగం సాధించాలని గట్టి సాధనతో ఉమ్మడి జిల్లాలో మొదటి ర్యాంకు సాధించడం జరిగిందని రవి తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన గాడి అనిల్ సోషల్ స్కూల్ అసిస్టెంట్ 15వ ర్యాంకు, త్రినాధరావు సోషల్ స్కూల్ అసిస్టెంట్ 25వ ర్యాంకులు సాధించారు.



గాడి అనిల్,



త్రినాధరావు



వివరాలు వెల్లడిస్తున్న న్యాయవాదులు

కోర్టుకు హాజరైన ఆర్ అండ్ బి అధికారులు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం ప్రధాన రహదారి, భీమిలి-నర్సీపట్నం రోడ్డు (బీఎన్ రోడ్డు) నిర్మాణంపై చోడవరానికి చెందిన న్యాయవాదులు, ఫర్ బెటర్ సభ్యులు చోడవరం కోర్టులో ప్రజా ప్రయోజనాల వాజ్యం కింద వేసిన కేసుకు సంబంధించి శనివారం ఆర్ అండ్ బి సెక్షన్ ఇంజనీరు, సదరు కాంట్రాక్టర్ కోర్టుకు హాజరయ్యారు. పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయని న్యాయమూర్తి ప్రశ్నకు వారు సమాధానం ఇస్తూ వచ్చేనెల 25వ తేదీకి దాదాపుగా బియన్ రోడ్ మరమ్మతు పనులు పూర్తవుతాయని, 2026 మార్చి నెలకు పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం జరుగుతుందని కోర్టుకు తెలిపినట్లు న్యాయవాది కాండ్రేగుల డేవిడ్ తెలిపారు. మరమ్మతు పనులు పది రోజుల్లో ప్రారంభిస్తామని కాంట్రాక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ సమస్య పరిష్కారం కానట్లయితే హైకోర్టును ఆశ్రయిస్తామని కోర్టుకు తెలిపినట్లు చెప్పారు. ఈ కేసును వచ్చేనెల 20కి తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు భరత భూషణ్, భూపతి రాజు, సామాజిక కార్యకర్త డిఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఇరువాడ, బాటజంగాల పాలెం-1 గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారి ఎస్.సూర్యలక్ష్మి శనివారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేశారు. గర్భిణులు, బాలింతలు, 3-6 సంవత్సరాల పిల్లల తల్లులతో సమావేశమై వారికి అందుతున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. బాటజంగాలపాలెంలో పరిశుభ్రత గురించి వివరిస్తూ వారి చేత ప్రతిజ్ఞ చేయించారు. సబ్బవరం కేజీబీవీలో నిర్వహించిన కిశోర వికాసం సమావేశంలో ఆమె పాల్గొని బాల్య వివాహాలు నిషేధంపై, పరిసరాల పరిశుభ్రత, వృత్తి విద్య కోర్సులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ వి.లలిత కుమారి, సూపర్వైజర్ డి.అప్పల నరసమ్మ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు తీసుకోవాలి


ప్రజాశక్తి-వడ్డాది : ఇంట్లో వాడికి నీరు పోవడానికి వీలు లేకపోతే ఇంకుడు గుంతలు తీసుకొని వాడుకోవాలని బుచ్చయ్యపేట మండలం ఎల్‌బిపి.అగ్రహారం పంచాయతీ కార్యదర్శి వెంకటపద్మ ప్రజలను ఆదేశించారు. పంచాయతీ అధికారుల మాటను దిక్కరిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. 'రోడ్డుపై ప్రవహిస్తున్న వాడుక నీరు' శీర్షికన గత వారంలో ప్రజాశక్తిలో ప్రచురించిన కథనానికి పంచాయతీ కార్యదర్శి వెంకట పద్మ స్పందించి పైవిధంగా ఆదేశించారు. వాడిక నీరు వస్తున్న ప్రాంతాన్ని శనివారం ఆమె పరిశీలించారు. వాడిక చేస్తున్న మహిళలతో మాట్లాడారు. ఇళ్లల్లో వాడుతున్న నీరు రోడ్డుపైకి ప్రవహించి ప్రయాణికులకు పాదాచారులకు ఇబ్బందిగా ఉంటుందని, అలా చేయకూడదని సూచించారు. మరో ఐదు రోజుల్లో ఇంకుడు గుంతలు తీసుకోకుంటే శాఖ పరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

సెయింట్ జాన్స్ స్కూల్లో ఉచిత దంత పరీక్షలు

ప్రజాశక్తి-కశింకోట : స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్లో విశాఖపట్నం అనిల్ నీరకొండ డెంటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భారతం శ్రీనివాస్ మాట్లాడుతూ దంతాలు ఆరోగ్యంగా ఉంటే మన శరీరం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. దంత వైద్యులు డాక్టర్ అనుపమ పొట్టమ్, డాక్టర్ నీరజ, 10 మంది వైద్యుల బృందం విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి, పళ్ళ సమస్యల గురించి తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బత్తుల అనురాధ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యురాలు



విజయ్ ప్రకాష్‌కు పశంసాపత్రం ఇస్తున్న ముఖ్యమంత్రి

విజయ్ ప్రకాష్‌ను ప్రశంసించిన ముఖ్యమంత్రి

ప్రజాశక్తి-పాయకరావుపేట : పి4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబం వజ్రపు వీరలక్ష్మి కుటుంబాన్ని దత్తత తీసుకున్న శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ విజయ్ ప్రకాష్‌ను ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెద్దాపురం పర్యటనలో భాగంగా ప్రత్యేకంగా ప్రశంసించారు.

రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా సరఫరా

ప్రజాశక్తి-కె.కోటపాడు : వరి నాట్లు వేసుకున్న రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కావలసిన ఎరువులను సరఫరా చెయ్యాలని మండల ప్రత్యేకాధికారి పూర్ణిమ దేవి ఆదేశించారు. శనివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మండలంలో మల్టీ డిసిప్లినరీ టీంను ఏర్పాటు చేశామని, ఇందులో మండల ప్రత్యేకాధికారి, తహసీల్దార్, ఎంపిడిఓ, ఎస్‌హెచ్‌ఓ (పోలీసు), మండల వ్యవసాయాధికారి ఉంటారని పేర్కొన్నారు. మండలంలో యూరియా ఎంత అవసరమో గుర్తించి దాని ప్రకారం సరఫరా జరుగుతుందన్నారు. ఎరువుల షాపుల్లో ఎక్కడైనా ఎంఆర్‌పి ధరల కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటి వరకు మండలానికి 427 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగిందన్నారు. ప్రస్తుతం 84 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, ఇందులో రైతు సేవ కేంద్రాలలో 48 మెట్రిక్ టన్నులు, కో-ఆపరేటివ్ సొసైటీలో 12 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్స్ దగ్గర 24 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు చెప్పారు.

రూ.20 లక్షలతో కమ్యూనిటీ హాల్ ఆధునికీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : జివిఎంసి 84వ వార్డు పరిధి కొండకొప్పాకలో కమ్యూనిటీ హాల్‌ను జీవీఎంసీ నిధులు రూ.20 లక్షలతో ఆధునికీకరిస్తున్నట్లు ఆ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి నీలబాబు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన హాల్‌ను పరిశీలించారు. చిన్న చిన్న మరమ్మతు పనులు తొందరగా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వానపల్లి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరుకు వరినాట్లు పూర్తి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ఇటీవల సంభవించిన అల్ప పీడనానికి బుచ్చయ్యపేట మండలంలో 204 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, రైతులు వరి నాటులు వేస్తున్నారని, ఈ నెలాఖరు నాటికి వరినాట్లు పూర్తయ్యే అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి భాస్కర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 2399 హెక్టార్లో వరి సాగు విస్తీర్ణం కాగా, ఇప్పటి వరకు 1208 హెక్టార్లలో వరి నాటులు వేసినట్లు పేర్కొన్నారు. వరి సాగులో ఖర్చులు తగ్గించుకొని దిగుబడులు పెంచుకోవడానికి వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని కోరారు. వర్షాలు ఎక్కువగా కురిసేటప్పుడు నీరు నిల్వ లేకుండా కిందకి పోయే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రతి రెండు మీటర్లకు 30 సెంటీమీటర్ల వెడల్పుతో కాలిబాటలు విడిచి పెట్టలని, సమగ్ర పోషక యాజమాన్యాన్ని పాటించాలని కోరారు. దమ్ములో డీఏపీగాని, గ్రోమోర్‌గాని ఎకరాకు ఒక బస్తా వేయాలని, దానితో పాటు 20 కిలోలు పొటాష్ కలిపి వేస్తే పైరు ఏపుగా పెరుగుతుందని చెప్పారు. సూపర్ ఫాస్పేట్, యూరియా, పటాస్రూపంలో వేస్తే ఒక ఎకరానికి సూపర్ఫాస్పేటు రెండు బస్తాలు, యూరియా అరబస్త, పొటాష్ 20 కిలోలు చొప్పున వేయాలని సూచించారు.

కనీస సౌకర్యాలు కల్పించరూ...



కనీస సౌకర్యాల్లేని నివాసాలు ఇవే..

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం సంత శివాలయం వద్ద ఉన్న తమ నివాసాలకు రహదారి, తాగునీటి వంటి సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. 2014లో సంభవించిన హుదూద్ తుపాన్‌కు ఇక్కడున్న పాకలు కొట్టికుపోయాయి. అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో 8 మందికి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసినా సౌకర్యాలు కల్పించలేదు. ప్రధానంగా రోడ్డు నిర్మాణం చేయాలని, జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఆ ప్రాంతం కొండవాలు కావడంతో ఇళ్ల చుట్టూ మొక్కలు పెరిగి భయకరంగా ఉంది. విషసర్పాలు తిరుగుతున్నాయి. సాయంత్రం 6 గంటల తరువాత ఇంటికి చేరాలంటే భయం గుప్పట్లో వెళ్లవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాటి టిడిపి ప్రభుత్వం ఇళ్లు ఇచ్చి చేతులు దులుపుకోగా, తరువాత వచ్చిన వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రహదారి, ఇతర సౌకర్యాలు కల్పించాలని అధికారులను వారు కోరుతున్నారు.



సిఎం సహాయ నిధి చెక్కు అందిస్తున్న తాతయ్యబాబు

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాది గ్రామానికి చెందిన వర్రి హర్షవర్ధన్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన లక్ష రూపాయల చెక్‌ను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు శనివారం బాధ్యత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వడ్డాది టిడిపి టౌన్ అధ్యక్షులు దొండా నరేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్-మనక్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : విజ్ఞాన శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థుల్లో మక్కువ పెంచేందుకు ప్రభుత్వం నిర్వహించే ఇన్‌స్పైర్ మనక్‌కు 6 నుంచి 12 తరగతుల విద్యార్థుల రిజిస్ట్రేషన్‌కు సెప్టెంబర్ 15 వరకు అవకాశం కల్పించినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, రెసిడెన్షియల్, ఆదర్శ, కస్తూర్బా, ప్రైవేట్, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి ఐదు ప్రాజెక్టులు, హైస్కూల్ ప్లస్ నుంచి ఏడు ప్రాజెక్టులు నమోదు చేసుకోవాలన్నారు. నామినేషన్లు ఎక్కువగా పంపి అనకాపల్లి జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు. నామినేషన్ ప్రక్రియలో సందేహాలను నివృత్తి చేసేందుకు ఈనెల 25న అనకాపల్లి డివిజన్లో పట్టణ బాలికల ఉన్నత పాఠశాల, నర్సీపట్నం డివిజన్‌లో నర్సీపట్నం మెయిన్ ఉన్నత పాఠశాలలో ఈనెల 26న అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ప్రతి ఉన్నత పాఠశాల, యూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఒక్క సైన్స్ టీచర్ను ఈ ఓరియంటేషన్ తరగతులకు డిప్యూట్ చేయాల్సిందిగా కోరారు. ఇతర వివరాలకు కాళిదాసు, జిల్లా సైన్స్ అధికారి 9293718851 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఖరీఫ్ సీజన్‌ను ఆదుకున్న వర్షాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆగస్టు నెలలో కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ సీజన్ ఆదుకున్నాయని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఇన్చార్జి ఏడిఆర్ డాక్టర్ శ్రీలత పేర్కొన్నారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం జరిగిన శిక్షణ సందర్శన కార్యక్రమంలో మాట్లాడారు. ఆగస్టు నెలలో 54 శాతం సాధారణ వర్షపాతం కంటే అధికంగా నమోదైందని చెప్పారు. దీంతో వరి నాట్లు ఇంత వరకు ఒక 30శాతం పూర్తయినట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి ప్రతినిధి శ్రీధర్ మాట్లాడుతూ రాబోయే పది రోజుల్లో పూర్తి శాతం వరి నాట్లు పడతాయన్నారు. రైతులకు కావలసిన ఎరువులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. తక్కువ ఖర్చుతో కూడుకున్న ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్టు ఏపీసీఎన్ఎఫ్ డిపిఎం సిహెచ్ లచ్చన్న తెలియజేశారు. కార్యక్రమంలో పూర్వపు ఏడీఆర్ డాక్టర్ పివికె జగన్నాధరావు, డాక్టర్ కేవీ రమణమూర్తి, డాక్టర్ ఎం విశాలాక్షి, డాక్టర్ బి ఉమామహేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఏడిఏలు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎంసిసి

ప్రజాశక్తి-కోటవురట్ల : మండల కోఆర్డినేషన్ కమిటీ ద్వారా సమస్యల పరిష్కరించనున్నట్లు తహసిల్దార్ తిరుమలబాబు తెలిపారు, స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి శోభారాణి సమక్షంలో ఎంపీడీవో చంద్రశేఖర్, స్థానిక ఎస్సై రమేష్‌తో కూడా మండల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. కోటవురట్ల, సుంకుపూరు, బోడపాలెం, పీకేపల్లి, రాజుపేట, ఎండపల్లి గ్రామాలకు సంబంధించిన పలు రెవెన్యూ సమస్యలపై అందిన ఫిర్యాదులను పరిశీలించారు. వీటిలో కోటవురట్ల సమస్యను పరిష్కరించినట్లు తహశీల్దారు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపిఆర్డి కూర్మారావు, జూనియర్ అసిస్టెంట్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం

- రైతులు వ్యతిరేకిస్తున్న నానో ఎరువుల అమ్మకాలు ఆపాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఖరీఫ్ సీజన్లో రైతులకు సరిపడా ఎరువుల సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీజన్‌కు ముందే అవసరమయ్యే ఎరువులు, విత్తనాలను అందుబాటులో వుంచకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. తక్షణమే ఎరువులను రైతులకు అందుబాటులో వుంచాలని కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో ఎరువులు, విత్తనాలను అరకొరగా సరఫరా చేయడం విచారకరమన్నారు. రైతులు అధిక ధరలు చెల్లించి ప్రైవేట్ షాపుల్లో కొనుక్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పంటల బీమా పథకం ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేదని, నేడు రైతులే చెల్లించాల్సి పరిస్థితి ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శాస్త్రీయంగా నిరూపితం కాకపోయినా సరే మోడీ ప్రభుత్వం నానో ఎరువుల అమ్మకాలు భారీగా పెంచేందుకు రాష్ట్రాలపై ఒత్తిడి పెంచిందని తెలిపారు. రైతులు తిరస్కరిస్తున్నా సరే కేంద్రానికి తలొగ్గి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో 2.6 లక్షల యూరియా బాటిళ్లు, 1.02 లక్షల డిఎపి బాటిళ్ల విక్రయించాలని చూస్తుందని మండిపడ్డారు. నానో ఎరువుల అమ్మే యత్నాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

దేవరాపల్లి : ఎరువులు కొరతను నివారించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్లో కావాల్సిన యూరియా, డిఎపి, పొటాష్ మొదలైన ఎరువులు కొరతతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే అవకాశంగా తీసుకొని ప్రైవేట్ వ్యాపారులు, డీలర్లు బ్లాక్ మార్కెట్లో రూ.267 ధర ఉన్న యూరియాను రూ.350 నుండి రూ.500కు విక్రయిస్తూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. మరో వైపు కల్తీ ఎరువులను సైతం రైతులకు అంటగడుతున్నారని తెలిపారు. చోడవరం ప్రాంతంలో శ్రీలక్ష్మి ఫెర్టిలైజర్స్ డిఎపి ఎరువులు కల్తీ విషయం బయటపడిందని, దీనిపై సమగ్రంగా దర్యాప్తు జరిపి, చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు.

ఘనంగా టంగుటూరి జయంతి



నివాళులర్పిస్తున్న ఎస్‌పి తుహిన్ సిన్హా, పోలీసులు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి స్థానిక ఎస్పీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ తుహిన్ సిన్హా ప్రకాశంపంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో, తుపాకీకి ఎదురు నిలిచి, చొక్కా విప్పి గుండె చూపుతూ "కాల్చండి" అని సాహసోపేతంగా నిలిచిన మహానుభావుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని, తన ధైర్యసాహసాలకు ప్రతీకగా "ఆంధ్రకేసరి" బిరుదు పొందారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఇన్స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బెండి వెంకటరావు, బాల సూర్యారావు, లక్ష్మి, రమేష్, రామకష్ణ, ఎస్సైలు ప్రసాద్, రమణయ్య, మల్లేశ్వరరావు, శిరీష పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో...

అనకాపల్లి : టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం కలెక్టర్ కార్యాలయంలో శనివారం జరిగింది. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, డిఆర్ఓ వై.సత్యనారాయణరావు, జిల్లా అధికారులు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుబ్బలక్ష్మి, రమామణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్ : స్థానిక శాఖా గ్రంధాలయంలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని గ్రంధాలయధికారిణి పి.దమయంతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠకులు రామచంద్రరావు, అప్పలస్వామి తదితరులు టంగుటూరి ప్రకాశం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాద్యాయుడు పి.ప్రభాకర్ మాట్లాడారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మిని స్టేడియంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. విశ్రాంత ఎంఈఓ జేఎస్ఎస్ నాగేశ్వరరావు, పట్టణ ప్రముఖులు అల్లు అప్పారావు, పిట్ల శ్రీనివాస్‌రావు, వి.గజ్జాలమ్మ, రామునాయుడు, లోవరాజు, రాజులునాయుడు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను విశాఖ కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

25న వికలాంగుల ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : అర్హులైన వికలాంగుల పింఛన్ల తొలగింపునకు వ్యతిరేకంగా ఈనెల 25న అనకాపల్లి జిల్లా కలెక్టచేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బుగిడి నూక అప్పారావు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అనర్హుల పింఛన్ల రద్దు కోసం చేపట్టిన రీవెరిఫికేషన్‌లో అర్హులైన వికలాంగులను కూడా అనర్హులుగా చూపించారని తెలిపారు. వారి పెన్షన్ రద్దు చేస్తున్నామని నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. ఇందుకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టర్ ఆఫీసుల వద్ద ఎన్‌పిఆర్‌డి ఆధ్వర్యాన నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. నిజమైన వికలాంగులకు యధావిధిగా పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ జరుగు ధర్నాకు అధిక సంఖ్యలో వికలాంగులు తరలిరావాలని కోరారు.

అర్హులైన వికలాంగులకు అన్యాయం చేయొద్దు

ప్రజాశక్తి-అనకాపల్లి : సదరం బోగస్ సర్టిఫికెట్ల ఏరివేతలో అర్హులైన వికలాంగులకు అన్యాయం చేయొద్దని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పాత్రపల్లి వీరు యాదవ్ పేర్కొన్నారు. సంఘ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఐదు లక్షల మందికి వెరిఫికేషన్ చేసి అందులో లక్ష మందిని అనర్హులుగా గుర్తించిందని, వీరిలో వేలల్లో అర్హులు ఉన్నారని తెలిపారు. వారంతా తీవ్ర ఆవేదన చెందుతున్నారని, ఇది వారి హక్కుల ఉల్లంఘన మాత్రమే కాకుండా, నేరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పునరాలోచన చేసి, రాష్ట్రంలో ఏ ఒక్క అర్హుడికి అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. లేకుంటే పోరాటాలు చేయవలసి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సంస్థ నాయకులు మొల్లి చంద్రశేఖర్, యలమర్తి రవి, మంత్రి శ్రీనివాసరావు, కరణం శివ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-మునగపాక : ప్రభుత్వం చొరవతో నిర్వహిస్తున్న జాబ్ మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేట డావెన్సీ ఇంటర్నేషనల్ స్కూల్లో మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో మూడు నెలలకు ఒకసారి ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం జాబ్ మేళా ద్వారా ఎంపికైన 100 మందికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్కూలు యాజమాన్యం, ఇండస్ట్రీస్ యాజమాన్యం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కులో విభాగాల ప్రైవేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విధానంలో చేస్తున్న 32 విభాగాల ప్రైవేటీకరణను ఆపాలని రైతుకూలీసంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు, నవ యువ సమాఖ్య రాష్ట్ర నాయకులు నందారపు భాస్కరరావు డిమాండ్ చేశారు. మండలంలోని బౌలువాడ గ్రామంలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు అనే నినాదంతో, 32 మంది ప్రాణత్యాగాలతో పోరాడి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం దారుణమన్నారు. ఒకవైపు విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని వేగవంతం చేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించలేని, రాష్ట్రంలోని 9 మంది కూటమి ఎంపీలంతా నక్కపల్లి వద్ద ఏర్పాటు చేయబోయే మిట్టల్ ప్రైవేటు స్టీల్‌ప్లాంట్‌కు గనులు, నిధులు, భూములు, సకల సౌకర్యాల కల్పన కోసం కేంద్ర ప్రభుత్వం వద్ద తీవ్ర ప్రయత్నాలు చేయడం శోచనీయమన్నారు. చింతల రమేష్, సేనాపతి అప్పలనాయుడు, సాలాపు బాబురావు పాల్గొన్నారు.

ముగిసిన ఎంఎస్ఎంఇ శిక్షణ

ప్రజాశక్తి-పాయకరావుపేట : పాయకరావుపేటలోని మన్న స్కూల్ ఆవరణంలో ట్రేజ్ ఐటి ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో వి.ప్రసాద్ బాబు పర్యవేక్షణలో జులై 21 నుండి 30 మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు జరిగిన ఎంఎస్ఎంఈ శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. పరిశ్రమ ఏర్పాటు, లాభనష్టాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు గూర్చి ట్రైనర్ శీలి జీవన్ తెలియజేశారు. ముగింపు కార్యక్రమంలో మన్న స్కూల్ ప్రిన్సిపాల్ చార్లెస్ ప్రసన్న రాణి ప్రోగ్రాంను పర్యవేక్షణ చేశారు. రెండో బ్యాచ్‌కు 18 నుండి 45 సంవత్సరాల వయస్సు గల ఔత్సాహిక నిరుద్యోగ యువతీ యువకులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9951447776, 6302830515 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

గెడ్డవాగులో అక్రమ నిర్మాణాల తొలగింపు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గొల్లలపాలెం రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 249లో గెడ్డవాగును ఆక్రమించి నిర్మించి అక్రమ నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది శనివారం తొలగించారు. సర్వే నెంబర్ 249లో సుమారు 69 సెంట్లు ప్రభుత్వ గెడ్డవాగు ఉంది. ఈ గెడ్డవాగు పోరంబోకులో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో గ్రామస్తులు స్థానిక రెవెన్యూ అధికారులకు, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామస్తుల ఫిర్యాదుకు స్పందించిన రెవెన్యూ అధికారులు పోలీసుల భద్రతతో ప్రభుత్వ గెడ్డవాగులో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకొని జెసిబితో తొలగించారు. ప్రభుత్వ గెడ్డవాగులలో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే వారిపై ల్యాండ్ గ్రాబింగ్ క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బి.వీరయ్య, వీఆర్వో దేముడుబాబు, రెవిన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాలు జెసిబితో తొలగిస్తున్న దృశ్యం

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ - పలు చోట్ల స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాలు



అనకాపల్లిలో స్వచ్ఛాంధ్రలో పాల్గొన్న కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లిచుట్టూ పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మన అందరి బాధ్యత ఆని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తను సిబ్బందితో కలిసి కలెక్టర్, జెసి తొలగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెల 3వ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల్లో చైతన్యం కల్గించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిపిఒ సందీప్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి : జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా ఆధ్వర్యాన పోలీసు అధికారులు, సిబ్బంది చెత్తాచెదారం తొలగించారు. అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, డిఎస్పీ బి.మోహనరావు, ఇన్స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బెండి వెంకటరావు, బాల సూర్యారావు, లక్ష్మీ, సురేష్, రామకృష్ణ ఎస్సైలు ప్రసాద్, మల్లేశ్వరరావు, శిరీష పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి, బుచ్చయ్యపేట, రాజాం తదితర గ్రామాల్లో శనివారం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీలు నిర్వహించారు. ఎంపీడీఓ బానోజీరావు, ఎపిఒ వరహాలుబాబు, పంచాయతీ కార్యదర్శి రావణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని ఎన్.గజపతినగరం, రైవాడ, తామరబ్బ, బోయిలకింతాడ గ్రామాలలో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి మంజులవాణి, ఎంపీడీవో సువర్ణరాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రైవాడ సర్పంచ్‌లు సిరికి లక్ష్మి, చల్లా లక్ష్మీనాయుడు, టోకూరి రామకృష్ణ, టిడిపి నాయకులు చల్లా నానాజీ, డిప్యూటీ ఎంపీడీవో కిరణ్ వరప్రసాద్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని నరసింగబిల్లి హైస్కూల్‌లో విద్యార్థులకు దోమలు వల్ల వచ్చి రోగాలుపై అవగాహన కల్పించారు. హెచ్ఎం కె.రవికుమార్, ఉపాధ్యాయులు బివి.లక్ష్మి, యర్రా శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్మన్ ఎస్.మణి పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని బంగారమ్మ పాలెంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి కె.రమామణి, ఎంపీడీవో శివప్రసాద్ నారాయణరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

నక్కపల్లి:పరిసరాల పరిశుభ్రతతో మంచి ఆరోగ్యం లభిస్తుందని మండల ప్రత్యేక అధికారి విజయ, ఎంపీడీవో సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు తెలిపారు. మండలంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నక్కపల్లి, వేంపాడు, ఉద్దండపురం గ్రామాల్లో పర్యటించారు. జూనియర్ కాలేజీలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మండల పరిషత్ కార్యాలయాన్ని పరిశుభ్రం చేశారు. ఉద్దండ పురంలో రైతు సేవా కేంద్రాలను సందర్శించి యూరియాపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ పాల్గొన్నారు.

చీడికాడ:మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు పారిశుధ్య పనులను చేయించారు



నక్కపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

ఎంపీడీవో హేమ సుందర్‌రావు సందర్శించి స్వచ్ఛత శుభ్రతపై తెలిపారు. పంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట రేంజ్ అటవీశాఖ కార్యాలయంలో సబ్ డిఎఫ్ఓ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

భీమునిపట్నం : మండలం, జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో పలుచోట్ల 'స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధర్యాన ర్యాలీ నిర్వహించారు. సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఫణికుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరిసరాలను శుభ్రపరిచారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిహెచ్.విష్ణుమూర్తి, పాల్గొన్నారు. తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు విద్యార్థులు "మాన్ సూన్ హైజీన్" పేరుతో కళాశాల పరిసర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్‌పి.శ్రీవాణి పాల్గొన్నారు

సీతమ్మధార : పెదగంట్యాడలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాల్లో భాగంగా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు పర్యవేక్షించారు. మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ హేమలత, డాక్టర్ సంపత్, ఎఎంఒ సిహెచ్.సత్యనారాయణ పాల్గొన్నారు.

సీతమ్మధార రైతు బజార్‌లో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కృష్ణమూర్తి, రైతులు, జివిఎంసి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పాలిథిన్ కవర్లు వాడకూడదని, గుడ్డ, నార సంచులు వాడాలని అవగాహన కల్పించారు.

ఆరిలోవ : 13వ వార్డులో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపి వేయాలని కోరుతూ శనివారం ర్యాలీ నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ, వార్డు టిడిపి అధ్యక్షులు పొత్రకండ ధర్మారావు పాల్గొన్నారు. ఆరిలోవ కాలనీ నుంచి దుర్గాబజార్ వరకు ప్లాస్టిక్ వాడకంతో కలిగే ప్రమాదాలను ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, వార్డు కార్యదర్శి సురేష్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట : "స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ప్రాంగణం, సింహగిరి పరిసరాల్లో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధా, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు





రావికమతం, నర్సీపట్నంలో తనిఖీలు చేపడుతున్న అధికారులు

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో కొత్తకోట త్రినేత్ర ఆగ్రో ఏజెన్సీలో ఎరువుల మందులను శనివారం రావికమతం మండల వ్యవసాయ అధికారి రమేష్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాస్ మిషన్ ద్వారా షాపులో ఉన్న ఎరువులను, మందులను పూర్తిగా పరిశీలించడం జరిగిందని తెలిపారు. రికార్డులను తనిఖీ చేయడం జరిగిందన్నారు. మండలంలో ఎరువులు, పురుగుల, మందుల షాపులులో ఎమ్మార్పీ రేటు కంటే ఎక్కువగా అమ్మినా, నకిలీ మందులను విక్రయించిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. లైసెన్సులను కూడా రద్దుపరచడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. రైతుల నుంచి తమకు ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఎరువుల దుకాణాలపై దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్సై రవికుమార్, టౌన్ ఎస్ఐ రమేష్ ఎంపీడీవో ఉషశ్రీ, వ్యవసాయ శాఖ అగ్రికల్చర్ ఆఫీసర్ విజయలక్ష్మి, ఆర్ఐ నాయుడు, ఏఈ మధు ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు. ఈ సమయంలో ఎరువులు దుకాణాలు మూసివేయడం గమనార్హం. రికార్డులను పరిశీలించారు.

గొలుగొండ: మండలంలోని ఏఎల్.పురంలో ఎరువుల దుకాణాలను మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, తహశీల్దార్ పీ.శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల వివరాలు, రిజిస్టర్ వంటి వాటిని క్షుణ్ణగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జీ ఎంపీడీఓ బాబురావు, మండల వ్యవసాయాధికారి సుధారాణి పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని ఎరువులు షాపుల విస్తృత తనిఖీలు నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి సుబ్బలక్ష్మి, సహాయ వ్యవసాయ సంచాలకులు సిహెచ్.సుబ్రహ్మణ్యం, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రామయ్య, స్థానిక ఇన్‌స్పెక్టర్ సంతోష్, ఎంపిడిఒ రాము, మండల వ్యవసాయ అధికారి పి.రంగాచారి ఎరువుల షాపుల్లోని స్టాకు వివరాలు, రిజిస్టర్లు, బిల్లులు, ఇతర సంబంధిత పత్రాలను అన్నింటిని కూలంకుషంగా పరిశీలించారు. ఎవరైనా మార్గదర్శకాలను అతిక్రమిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మాత్రమే అమ్మాలని, ఎటువంటి కల్తీ ఉండకూడదని స్పష్టం చేశారు. ఇప్పటివరకు మండలంలో 526 మెట్రిక్ టన్నుల యూరియాను ప్రైవేటు డీలర్లు, సొసైటీలు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందించినట్లు మండల వ్యవసాయ అధికారి వివరించారు.

కోటవురట్ల : మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో మండల స్థాయి అధికారులు శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. గోదాముల వివరాలు అడిగి తెలుసుకొని వాటిని కూడా పరిశీలించారు, మండల ప్రత్యేకాధికారి శోభారాణి, తహశీల్దారు తిరుమల బాబు, ఎంపీడీవో చంద్రశేఖర్, వ్యవసాయ శాఖ అధికారి సరోజిని పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడులో ఉన్న ప్రైవేట్ ఎరువుల దుఖాణాలను మండల ప్రత్యేకాధికారి పూర్ణిమ దేవి ఆధ్వర్యాన తనిఖీలు చేశారు. బిల్ బుక్స్, స్టాక్ బుక్స్, గోడౌన్ స్టాక్‌ను ఈ పోస్ మెషిన్‌తో సరిచూశారు. సరఫరాను జాగత్తగా చేసుకోవాలని షాపు యజమానులకు సూచించారు. కార్యకరంలో మండల తహసీల్దార్ భుజంగరావు, ఎంపిడిఓ సాంబశివరావు, మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ పాల్గొన్నారు.



మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

బహిరంగ మల విసర్జనను నిర్మూలించాలి

ప్రజాశక్తి-చీడికాడ:గ్రామాలలో ఆరుబయట మలవిసర్జనను నిర్మూలించాలని అందుకు పంచాయతీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో హేమ సుందర్ రావు తెలిపారు. మండలంలోని జైతవరం గ్రామంలో శనివారం ఆయన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణరకు తీసిన గొయ్యిలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఆరు బయట మలవిసర్జనతో ఈగలు, దోమలతో అనారోగ్య సమస్యలు ప్రజలకు తెలియజేయాలని ఆయన తెలిపారు.



చెక్కును అందజేస్తున్న స్పీకర్ అయ్యన్న

సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్.పురం గ్రామానికి చెందిన పోతల అప్పలనాయుడు ఆరోగ్య పరిస్థితిని మాజీ జెడ్పీటీసీ చిటికెల తారక వేణుగోపాల్ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో అప్పలనాయుడుకు రూ.లక్ష రూపాయల సీఎం సహాయక చెక్కు మంజూరైంది. ఈ మేరకు స్పీకర్ ఆ చెక్కును అప్పలనాయుడుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు పెట్ల నారాయణమూర్తినాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షులు జమీలు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి పిత్రుగెడ్డ గ్రామంలో వైద్యాధికారులు శివప్రసాద్, జానకి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ రమణ తమ సిబ్బందితో శనివారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు రక్త పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల ప్రభావితం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్థులకు వివరించారు. ఎంఎల్‌హెచ్‌పి పార్వతి, హెల్త్ అసిస్టెంట్ అప్పారావు, ఏఎన్ఎం లక్ష్మీ పాల్గొన్నారు.

ఆడారి ఆనంద్‌కు అభినందనలు

ప్రజాశక్తి -నక్కపల్లి:విశాఖ డెయిరి చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులు కావడంతో ఆ పార్టీ జిల్లా నాయకులు కోసూరు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, పార్టీ మండల శాఖ అధ్యక్షులు నానాజీ, రవి రాజు ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. శనివారం ఆయన విశాఖ నుండి విజయవాడ వెళుతుండగా మార్గమధ్యలో నక్కపల్లి బిజెపి కార్యాలయం వద్ద పార్టీ కేడర్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. చిన్నదొడ్డిగల్లు బీసీసీ సూపర్వైజర్ శంకర్ ఆధ్వర్యంలో వేతన కార్యదర్శులు ఆనంద్ కుమార్ కు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించారు.



క్లాత్ సంచులను ఆవిష్కరిస్తున్న సర్పంచ్, టీచర్స్

ప్లాస్టిక్ సంచులు వాడొద్దు

ప్రజాశక్తి-రావికమతం:గ్రామంలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, దానికి గ్రామ ప్రజలందరూ పూర్తిగా సహకరించాలని సర్పంచ్ దాసరి సూర్యకుమారి తెలిపారు. మండలంలోని కవగుంట ఎంపీయుపీ పాఠశాలలో శనివారం కాటన్ క్లాత్ సంచులను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ భూమిలో కుల్లదని, దీంతో కలుషితం అవుతుందన్నారు. క్లాత్ సంచులు వాడటంతో అవి భూమిలో కుళ్ళి మట్టిలో కలిసిపోతాయన్నారు. దీంతో భూమికి ఎటువంటి ఇబ్బంది కలగదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, ఎస్ఎంసి చైర్మన్ శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ శచీదేవి

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:రుణాలను సద్వినియోగం చేసుకొని జీవనోపాధి మెరుగు పరుచుకోవాలని డి ఆర్‌డిప పిడి శచీదేవి సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం మండల సమాఖ్య కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బ్యాంకు రుణాలు, స్త్రీనిధి రుణాలు తీసుకున్న మహిళలు వ్యాపార రంగాల్లో రాణించి ఆర్థికంగా ఎదగాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా అధిక లాభాలు అర్జించవచ్చునన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పశువులను కొనుగోలు చేసుకుని పాల వ్యాపారంలో రాణించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిఎం శ్రీనివాస్, సీసీలు, ఎంఎస్ ఏ.గీత, మండల సమాఖ్య అధ్యక్షురాలు అనంత లక్ష్మి, సెక్రటరీ మాధురి, కోశాధికారి తేజ, ఈసీలు పాల్గొన్నారు.



మృతి చెందిన ఆవు

రెండు పాడి ఆవులు మృతి

-హెటిరో కాలుష్యమే కారణమా ?

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో రాజయ్యపేట గ్రామంలోని బొందలపు విజయ్ కు చెందిన రెండు ఆవులు మృతి చెందినట్లు మైలపల్లి బైరాగిరాజు తెలిపాడు. బాధిత పాడి రైతులతో కలిసి మాట్లాడుతూ, ఉప్పుటేరులో హెటిరో కంపెనీ వ్యర్థ జలాలు కలవడంతో ఆ నీటిని పాడి పశువులు తాగడంతో రెండు పాడి ఆవులు శనివారం మృత్యువాత పడినట్లు ఆరోపించాడు. గతంలో కూడా ఇలాగే పశువులు మృతి చెందగా, జిల్లా కలెక్టర్, పొల్యూషన్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్య తీసుకోలేదని ఆవేదన వెలిబుచ్చారు.ఉప్పుటేరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని, నష్టపోయిన పాడి రైతుకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోడ కాశీరావు, పిక్కి ఏడుకొండలు, అప్పలరాజు, సిహెచ్ రాజు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి-గొలుగొండ:రైతులు తమ భూ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని తహశీల్దార్ పీ.శ్రీనివాసరావు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో భూ సమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ వివాదాలకు దూరంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకుంటే ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ బాబురావు, ఎస్సై రామారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్

విలువిద్యలో సత్తాచాటిన విద్యార్థులు

ప్రజాశక్తి-పాడేరు: పట్టణంలోని శ్రీ మోదమాంబ హైస్కూల్ విద్యార్థినీలు 'జాతీయ క్రీడ దినోత్సవం'ని పురస్కరించుకుని విశాఖపట్నం, కొమ్మాదిలో నిర్వహించిన జోన్-ఎ విలువైద్య పోటీలో విద్యార్థినులు వూడి యశస్వి (కాంస్య పతకం), వంతల కీర్తి పాల్గొని అత్యున్నత ప్రతిభను కనబర్చి రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారని శనివారం ఈ పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది హర్షం వ్యక్తం చేసారు.

దినదినాభివృద్ధిలో భూషణ్ ఐటిఐ

ప్రజాశక్తి -నర్సీపట్నం:నర్సీపట్నం- పెద్ద బొడ్డేపల్లిలో గల భూషణ్ ఐటిఐ 1984లో ప్రారంభమైందని, దినదినాభివృద్ధి చెందుతుందని ప్రిన్సిపాల్ దేవాడ బంగారు నాయుడు తెలిపారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. ప్రజల మన్ననలు పొందుతూ, 40 సంవత్సరాల అనుభవం కలిగిన భూషణ్ ఐటిఐ క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచింది. సువిశాలమైన శిక్షణ తరగతులతో పాటు అత్యాధునిక సాంకేతిక టెక్నాలజీ వినియోగిస్తూ అనుభవజ్ఞులైన అధ్యాపకులతో క్రమశిక్షణ లక్ష్యంగా ఉత్తమ శిక్షణను అందిస్తుంది. ఆలిండియా లెవెల్లో 40 ఐటిఐల్లో 35వ స్థానం పొందింది. ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్ లో ఫిట్టర్ ట్రేడ్‌లో ప్రథమ,ద్వితీయ సంవత్సరంలో స్టేట్ టాపర్గా నిలిచింది. ప్రతి ఏటా 400 మంది విద్యార్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విలువైన విద్యను శిక్షణను అందించి విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



సత్ప్రవర్తన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-గొలుగొండ:జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వై.తారకేశ్వరరావు శనివారం వివిధ కేసుల్లో ఉన్న నేరస్తులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవన్నారు. గంజాయి సేవించినా, అక్రమ రవాణాలో పాల్గొన్నా వారిపై పీడీ యాక్ట్, ఫిట్ ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ



సిఐటియు ఆధ్వర్యాన అచ్యుతాపురంలో ర్యాలీ చేస్తున్న ఆటో కార్మికులు

ఆటో కార్మికులను ఆదుకోవాలని ర్యాలీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో నష్టపోతున్న ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో అచ్యుతా పురంలో శనివారం ఆటో కార్మికులు ర్యాలీ చేశారు. అనంతరం తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, మండల కన్వీనర్ కె సోము నాయుడు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలు రాక స్వయం ఉపాధి పొందుతున్న ఆటో కార్మికులకు ఉచిత బస్సు ప్రయాణం శాపంగా మారిందన్నారు. ఆటోలపై ప్రయాణాలు సాగించేవారు సంఖ్య తగ్గడంతో బ్యాంకులలో తీసుకున్న రుణాలు చెల్లించలేని పరిస్థితిలో ఆటో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఆటో లైసెన్స్ పొందిన ప్రతి కార్మికుడికి ఇన్సూరెన్స్, ఫైన్‌లు వంటివి రద్దు చేయాలని, ఉబర్, వాలా వంటి సర్వీసులు ప్రభుత్వమే నిర్వహించాలని, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని, ఆటో కొనుగోలుకు రూ.ఐదు లక్షలు వడ్డీ లేని రుణం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు ఆటో యూనియన్ల నాయకులు సంతోష్, దమ్ము చండీ, రాజు, కర్రి నాయుడు, శ్రీను, పైడికొండ ఎల్లారమ్మ, ప్రవీణ్, జగన్నాపురం, బి.రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాసవి క్లబ్ ఉపకార వేతనాల పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట వాసవి క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఐదుగురు పేద విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.1000 చొప్పున రూ.5 వేలు స్కాలర్ షిప్ చెక్‌లు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ఐఈసి ఆఫీసర్ పులవర్తి సత్యవరహాలరావు మాట్లాడుతూ వాసవి క్లబ్ విద్యార్థులు, పాఠశాల ప్రగతికి అనేక విధాలుగా సహాయం చేయడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం శశికళ, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ జె.నూకరాజు, ప్రధాన కార్యదర్శి డివికె.గుప్తా, డిస్ట్రిక్ట్ ఆఫీసర్ కె.వెంకటేశ్వరరావు, జి.సందీప్ డి.ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలుపుదలపై ప్రజలకు సమాచారం ఇవ్వాలి

ప్రజాశక్తి-కశింకోట : గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేసేటప్పుడు సమాచారం ఇవ్వాలని జె.తుని సర్పంచ్ కోన అరుణ శనవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎటువంటి సమాచారం లేకుండా ఎపిఇపిడిసిఎల్ అధికారులు విద్యుత్ నిలుపుదల చేయడం సరికాదని తెలిపారు. ప్రజలకు విద్యుత్ నిలుపుదల సమాచారం ఇవ్వకపోవడంతో జె.తుని, నరసింగబిల్లి గ్రామాల ప్రజలు ఇబ్బంది పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.